రోయ్ లే-అవుట్‌లో
40x40 కమర్షియల్ గొడౌన్ గ్రౌండ్ ఫ్లోర్
40x40 ఫస్ట్ ఫ్లోర్
అద్దెకు ఇవ్వబడును
కాంటాక్ట్ నెంబర్లు 9441937973 9440343432
నియర్ జోసెఫ్ కాన్వెంట్, శ్రీకాకుళం.

పేపర్ బాయ్స్
కావలెను
సంచలన సాయంకాల పత్రిక 'సత్యం'లో పని చేసేందుకు పేపర్‌బాయ్స్ కావలెను.
- సంప్రదించండి -
94414 66455

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
సోమవారం 4-11-2024
సంపుటి: 20 సంచిక: 187
పేజీలు: 4 వెల: రూ.1

ICL COURIER
INTERNATIONAL COURIER & CARGO
విదేశాలకు అతి తక్కువ ధరలో వేగవంతమైన సర్వీసు
పచ్చళ్లు బట్టలు పిండివంటలు బుక్స్ స్వీట్స్ మెడిసిన్స్ మొదలగునవి పంపించబడును.
- Free Door Step Pickup - World wide Services
- Low Cost & Fastest Delivery - Easy Online Tracking
- Safe & Secure Delivery - Free Box Packing
దూదివారి కోవెల ప్రక్కన, చిన్నబజార్ రోడ్, శ్రీకాకుళం.
9989172822, 9505944572, 9248199493

# అంతా ఆయనే చేస్తున్నారు!

- రోజుకు లక్షకు పైనే ఆమ్యామ్యా
- డిపోలో చక్రం తిప్పుతున్న డీపీవో
- మద్యం సరఫరాలో అస్మదీయులకు పెద్దపీట
- వాటాలు అడుగుతారని సీనియర్లకు ఉద్వాసన
- ఎచ్చెర్ల బాట్లింగ్ గొడౌన్‌లో అవినీతి కంపు


ఎచ్చెర్లలోని ఏపీఎస్‌బీసీఎల్ లిక్కర్ డిపో

వ్యాపారం చేయనక్కర్లేదు. కంపెనీలు పెట్టక్కర్లేదు. అన్నింటికీ మించి జీతాల కోసం అస్సలు ఎదురుచూడక్కర్లేదు.. జిల్లాలో ఏ మూలో మూడోకంటికి తెలియకుండా మనం తాగుతున్నందున జిల్లాలో మద్యం సరఫరా చేసే బాట్లింగ్ యూనిట్‌లో ఉన్న ఒక ఉద్యోగికి రోజుకు అక్షరాలా రూ.1.13 లక్షలు అప్పనంగా వస్తుందంటే నమ్ముతారా? మామూలుగా ఏకవాక్యంలో చెబితే ఎవరూ నమ్మరు. కానీ ఇందుకు సహేతుకమైన ఉదాహరణలు చెబితే నమ్మితీరాల్సిందే.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో (రాజాం, పాలకొండ కలుపుకొని) 189 మద్యం షాపులను ఇటీవల ప్రైవేటు వ్యాపారులు దక్కించుకున్నారు. ఇందులో కొత్త జిల్లాలో 158, రాజాం, పాలకొండల్లో 31 షాపులు ఉన్నాయి. వీటన్నింటికీ ఎచ్చెర్లలో ఉన్న ఏపీబీసీఎల్ నుంచే మద్యం బాటిళ్లు సరఫరా చేయాలి. సరిగ్గా ప్రైవేటు వ్యాపారాలనగానే సొమ్ములు దండుకోవడమెలాగో తెలిసిన ఎక్సైజ్ సిబ్బంది నొప్పి తెలియకుండా సొమ్ములు గుంజేస్తున్నారు. జిల్లాలో అటు ఇచ్ఛాపురం నుంచి ఇటు రాజాం వరకు షాపులకు అవసరమైన మద్యం బాటిళ్లను కొనుగోలు చేయడానికి ఇండెంట్ పెడితే, ఒక్కో షాపునకు ఒక్కో ఇండెంట్‌కు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. అలాగే ఒక షాపునకు అవసరమైన బాటిళ్లను బయటకు పంపేముందు దాని క్యూఆర్ నెంబర్‌ను స్కాన్ చేసి బిల్ చేస్తారు. ఈ స్కానింగ్ దగ్గర రూ.100 తీసుకుంటున్నారు. అలాగే ఒక కేస్ బాటిళ్లను లిఫ్ట్ చేయడానికి గతంలో 6.50 రూపాయలు తీసుకునేవారు. ఇప్పుడు దాన్ని 8 రూపాయలకు పెంచారు. షాపునకు కావాల్సిన సరుకును ఇండెంట్ పెట్టిన తర్వాత ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ మీద సంతకం చేయడానికి ఒక లోడ్‌కు రూ.100 చెల్లించాల్సి వస్తుంది. ఇది కాకుండా గేట్‌మామూళ్లంటూ రూ.100, విరిగిపోయిన బాటిళ్లు ఉన్నాయా, లేవా అని చూడటానికి రూ.100 చొప్పున ప్రతీచోట ఎచ్చెర్ల ఏపీబీసీఎల్ వద్ద దోచేస్తున్నారు. కొత్త మద్యం పాలసీ వచ్చిన తర్వాత తమ బ్రాండ్‌లు ప్రమోట్ చేసుకోవడం కోసం ఎన్ని లిక్కర్ బ్రాండ్‌లు ఉన్నాయో, అన్ని కంపెనీల రిప్రజంటేటివ్‌లు కమీషన్ కింద డిపోకు రూ.5వేలు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయానికి రూ.5 వేలు చొప్పున చెల్లించారని వినికిడి.

## డీఎం లేకపోవడంతో డీపీవో దోచేస్తున్నారు

ఎచ్చెర్ల ఏపీబీసీఎల్‌కు ప్రస్తుతం డిపో మేనేజర్ లేరు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత జయసింహ చౌదరి అనే అధికారిని నియమించినా, ఆ తర్వాత ఆయన్ను వెనక్కు పంపించేశారు. రాష్ట్రవ్యాప్తంగా 16 మంది డీఎంలు మాత్రమే ఉండాలి. కానీ రెండుచోట్ల ఆ స్థాయి అధికారి లేకపోవడంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్లను డిపో మేనేజర్లుగా నియమించారు. కానీ ఆ తర్వాత కొత్తవారిని తేవడంతో జయసింహ చౌదరిని వెనక్కు పంపించారు. కానీ ఇప్పటికీ ఇక్కడ డిపో మేనేజర్‌ను వేయలేదు. దీంతో ఎక్సైజ్ సూపరింటెండెంటే డిపో మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎక్సైజ్ పాలసీ ప్రైవేటీకరణ జరగడం వల్ల ఈఎస్ ఆఫీసులోనే తిరుపతినాయుడుకు సమయం సరిపోవడంలేదు. దీంతో డిపోను పూర్తిగా డీపీవో వెంకటేశ్వరరావుకు అప్పగించేశారు. వాస్తవానికి డిపో మేనేజర్ లేనప్పుడు అసిస్టెంట్ మేనేజర్ ఉండాలి. కానీ ఇక్కడ ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది. దీంతో డీపీవోనే మొత్తం ఈ సొమ్ములన్నింటినీ వసూలు చేస్తున్నారని తెలుస్తుంది. ఆమధ్య కొత్త మద్యం షాపులు ప్రారంభించినప్పుడు ఫస్ట్ ఇండెంట్‌కు రూ.500 చొప్పున తీసుకున్నారు. మద్యం వ్యాపారం చేస్తున్నాం, కోట్లలో సంపాదించేస్తామన్న భావనతో అన్ని షాపులు ఆ మేరకు సమర్పించుకున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం చెబుతున్న 20 శాతం మార్జిన్ కంటే తక్కువ వస్తుందని తేలడంతో డిపోలో ప్రతీచోట సొమ్ములు చెల్లించడానికి షాపు యజమానులు సతమతమవుతున్నారు. డీపీవో వచ్చే ఏడాది మార్చిలో రిటైరవుతారని, అంతవరకు ఇక్కడకు ఏఎం, డీఎంలను వేయకుండా జిల్లాకు చెందిన తెలుగుదేశం నేతలతో చెప్పించుకున్నారని ప్రచారం జరుగుతుంది. అందుకు ప్రతిగా తెలుగుదేశం కీలక నేతల బినామీల చేతిలో ఉన్న మద్యం షాపులకు ఫేవర్ చేస్తున్నట్లు తెలుస్తుంది. కూటమి ప్రభుత్వం రూ.99కే క్వార్టర్ బాటిల్ అందిస్తుంది. దీనికి విపరీతమైన డిమాండ్ ఉంది. అయితే అన్ని షాపులకు - మిగతా 4లో

# గోవిందా!.. ఏమిటా కండువా?

- కళింగకోమటి రాష్ట్ర అధ్యక్షుడి మెడలో వైకాపా రంగు
- అవాక్కయిన టీడీపీ శ్రేణులు
- సోషల్‌మీడియాలో విపరీతంగా ట్రోల్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇంకా వైకాపా పెత్తనమే చెల్లుబాటవుతుందని 'ఆంధ్రజ్యోతి'లో రోజూ ఏదో ఒక కథనం రూపంలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ టీడీపీ కార్యకర్తల మీద వైకాపా సానుభూతిపరులు దాడులు చేస్తున్నారన్న ఫొటోలు దర్శనమిస్తున్నాయి. ప్రధానమైన పోస్టుల్లో వైకాపా చెప్పినట్టు గతంలో ఆడిన అధికారులే ఉన్నారని 'ఈనాడు' కూడా బాధపడిన సందర్భాలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. ఇందులో ఏది ఎంత శాతం నిజమన్న విషయం పక్కన పెడితే, తెలుగుదేశం రాష్ట్ర పార్టీ నేత ఒకరు వైకాపా కండువాతో ఓ కార్యక్రమంలో కనిపించి, ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నారు. వివరాల్లోకి వెళితే..**



శ్రీకాకుళం పట్టణంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం విశాఖపట్నంకు చెందిన ఓ వైకాపా నాయకుడు కళింగ కోమటి వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్రకార్యదర్శి బోయిన గోవిందరాజులు హాజరయ్యారు. ఆయనతో పాటు 40 మంది పైచిలుకు టీడీపీ నాయకులు వచ్చారు. అయితే ఇక్కడే ఓ అరుదైన ఘట్టానికి తెరలేచింది. ఈ టీడీపీ నాయకులందరికీ వైకాపా కండువా వేసి ఆహ్వానించడం కొసమెరుపు. ఏ ఒక్క టీడీపీ నాయకుడు కూడా వైకాపా కండువా వేస్తుండగా వ్యతిరేకించకపోవడం, దీనికి తోడు వాట్సాప్ గ్రూపుల్లో తామేదో ఘనకార్యం చేసినట్టు ఫొటోలు షేర్ చెయ్యడంతో జిల్లాలోని టీడీపీ శ్రేణులందరూ అవాక్కయ్యారు. బోయిన గోవిందరాజులు ప్రస్తుతం రాష్ట్ర కళింగకోమటి సంఘం అధ్యక్షులుగా ఉన్నారు. గోవిందరాజులు రాష్ట్ర అధ్యక్షుడు అయిన తర్వాత ఏర్పాటుచేసిన కమిటీల్లో కూడా 40 శాతానికి పైబడి వైకాపా నాయకులే ఉన్నారు. అదీ కాకుండా వీరిలో ఎక్కువమంది కీలక పదవుల్లో ఉన్నారు. అలవాటులో పొరపాటుగా మొన్నటి వరకు ఈ సంఘం వైకాపా చేతిలో ఉండటం వల్ల ఈ కండువాలు వేశారా, లేదూ అంటే అధ్యక్షుడు మారినంత మాత్రాన తమ సత్తా తగ్గలేదని నిరూపించడానికే కండువాలు వేశారా, లేదూ గతంలో హోల్‌సేల్‌గా కొనేసి ప్రభుత్వం మారిన తర్వాత వేస్టయిపోతాయని వాడేశారో తెలియదు గానీ స్టేజ్ మీద ఉన్న టీడీపీ నాయకులు వైకాపా కండువాలతో కనిపించారు. విచిత్రమేమిటంటే.. అక్కడున్న వైకాపా నేతల మెడలో మాత్రం ఆ పార్టీ కండువాలు లేవు. ఇదే విషయాన్ని బోయిన గోవిందరాజులు వద్ద 'సత్యం' ప్రస్తావించగా, గౌరవంగా మెడలో కండువాలు వేసి ఆహ్వానించడాన్నే తప్ప, అవి ఏ రంగులో ఉన్నాయో తాను చూడలేదన్నారు. సంఘాన్ని బలోపేతం చేయడం కోసం అన్ని పార్టీల్లో ఉన్న ప్రముఖులను కలుపుకొని వెళ్తున్నామని, ఈ కార్యక్రమాన్ని నిర్వహించినవారికి మెడలో ఎటువంటి కండువాలు వేస్తున్నామన్న స్పృహ ఉండాలే కాని, తాము ఇవన్నీ చూసుకోలేమన్నారు. ఇదిలా ఉండగా, జగన్మోహన్‌రెడ్డి మాదిరిగానే చంద్రబాబు కూడా కుల కార్పొరేషన్లు ఇస్తున్నారని, అదే జరిగితే కళింగ కోమటి కార్పొరేషన్‌కు బోయిన గోవిందరాజులు పేరు ముందు వరుసలో ఉంటుంది కాబట్టి ఆయన్ను ఇరికించేందుకే వైకాపా నేతలు ఓ పథకం ప్రకారం ఈ కండువాలు వేశారన్న వాదన కూడా సోషల్ మీడియాలో ట్రోల్ అవుతోంది.


వార్షికోత్సవ శుభాకాంక్షలు
మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు వార్షికోత్సవ శుభాకాంక్షలు
శివశంకర కంప్యూటర్స్

సేల్స్ & సర్వీసింగ్ పాయింట్
ల్యాప్‌టాప్ మదర్‌బోర్డ్స్, యు.పి.ఎస్.అన్ని రకముల ప్రింటర్స్ & కేట్రిడ్జ్‌లు,

కేట్రిడ్జ్‌లు రీఫిల్లింగ్ & నెట్‌వర్కింగ్
పి.సోమశేఖరరావు
సెల్: 90109 30022, 7989276296, 9492762450
చంద్రమౌళి డిపార్ట్‌మెంటల్ స్టోర్ ఎదురుగా, కళింగరోడ్డు, శ్రీకాకుళం - 532 001

# మనిషి ఊసేలేని మహాకావ్యాలెందుకు..!

**వెయ్యేళ్ల నాటి సమాజం కన్నా వందేళ్ల నాటి సమాజం పరిణతి చెందింది. వందేళ్ల నాటి సమాజం కన్నా నేటి సమాజం పరిణతి చెందింది. ఇప్పుడు ఈ కాలంలో బతుకుతూ, వెయ్యేళ్ల నాటి ఆచారాలు, నమ్మకాలు, సంస్కృతి పేరుతో పాటిస్తానంటే వారినేమనాలి? అయినా చారిత్రక ఆధారాలు లేని కల్పిత పాత్రల కోసం అల్లరి మూకలు 'సంస్కృతి' పేరుతో చెలరేగిపోవడం ఎవరు హర్షిస్తారూ?**



ఒకాయన లాయర్ దగ్గరికెళ్లి 'సార్.. ఈ రామాయణ మహాభారతాలు అన్నీ ఒకటేనా లేక వాటిలో ఏదైనా తేడా ఉందా?' అని అడిగాడు. 'ఆ.. ఆ... తేడా ఉంది.. రామాయణం కిడ్నాపు కేసు. మహాభారతం భూమి తగాదా కేసు' అని తనదైన శైలిలో జవాబిచ్చాడు ఆ లాయరు.

రామాయణ మహాభారతాలు భారతదేశంలో రెండు మహా కావ్యాలుగా ఏళ్ల తరబడి చలామణి అవుతున్నాయి. అయినా అందులోని పలు అంశాలు ఇప్పటికీ చర్చించబడుతూనే ఉన్నాయి. తల్లిదండ్రుల మాట జవదాటకుండా ఉండడం, భార్యాభర్తల అన్యోన్యత, అన్నదమ్ముల అనుబంధం, స్నేహానికి ప్రాధాన్యమివ్వడం, రాజనీతి, మధ్యవర్తిత్వం, కొంత దైవత్వం, కొంత మానవత్వం, స్త్రీ, పురుషుల ఆకర్షణకు కులాలు అడ్డు రాకపోవడం వంటి వాటిని ఎలుగెత్తి చెపుతూ వాటికి గొప్పదనాన్ని ఆపాదించారు. మౌఖిక ప్రచారంలో ఉన్న కథలు, తాళపత్ర గ్రంథాల్లోకి, తర్వాత కాగితాల మీదికి వచ్చాయి. అవే కథలు ఎందరో రచయితలు తమ తమ వర్ణనలు జోడిస్తూ తిరగరాయడం వల్ల దేశంలో వేల వేల సంఖ్యల్లో ఈ కావ్యాలు తయారయ్యాయి. ఈ కథలు పరిణతి చెందని సమాజం లోంచి పుట్టుకొచ్చాయి గనుక, ఆధునిక దృష్టికోణం ముందు ఇవి నిలబడడం లేదు. నేటి పరిణతి చెందిన సమాజంలోంచి వీటిని విశ్లేషించుకుంటే, ఈ కావ్యాల్లో మానవ సంబంధాలు సరిగా లేవేమోననిపిస్తుంది. నైతికత అసలే లేదనిపిస్తోంది. అందులోని పాత్రలు వాటికి తోచిన విధంగా అవి ప్రవర్తించడం పైగా, వాటి ప్రవర్తనంతా ధర్మ సమ్మతమే అని నమ్మబలకడం కనిపిస్తుంది. పరిణతి లేని పరిపక్వతలేని, నియమ నిబద్ధత లేని సమాజం అభివృద్ధి చెందుతున్న దశలో సృష్టించబడ్డ కథలు ఇలాగే ఉంటాయని మనం గ్రహించుకోవాలి.

నిజానికి నేటి ఆధునికులకు ఇందులోని పాత్రలు, వాటి వ్యక్తిత్వమూ అనుసరణీయం కాదు. మానవ ప్రవృత్తితో హాయిగా కథల్ని నడపలేక కిన్నెరలు, కింపురుషులు, దేవతలు, యక్షులు, గంధర్వులు, రాక్షసులు, మహిమలు, దివ్యానుభూతులు, అతీంద్రీయ శక్తుల వంటి వాటినన్నింటినీ ఆనాటి రచయితలు ఇందులో ప్రవేశపెట్టారు. అందుకే అవి మనిషి కథలు కాకుండా పోయాయి. రచన అనేది సృజనాత్మక ప్రక్రియ, నిజమే, కాని, ఇందులో ఏ మాత్రమూ వాస్తవిక సృజనాత్మకత లేదు. అవాస్తవిక సృజనాత్మకత ద్వారా ఇవి మానవ జాతిని భ్రమల్లోకి, భయాల్లోకి నెట్టడం జరిగింది. మాయలు, మర్మాలు అభూత కల్పనలు రాసుకోవడంలో సనాతన భారతీయ సమాజం ఎంతో ఎత్తుకు ఎదిగింది. ఒప్పుకోవాల్సిందే. ఈ ఆధునిక కాలంలో ఒక వెల్లువలా దూసుకొస్తున్న వైజ్ఞానిక అవగాహన కోణం, మానవీయ కోణం లోంచి చూస్తే మాత్రం ఇలాంటి కావ్యాలు, కథలు దయనీయంగా, కుప్పగూలిపోతున్నాయి. నేటి ఆధునికుడు తన ఇంగిత జ్ఞానాన్ని నిద్రబుచ్చి వింటేనే ఈ కావ్యాన్ని ఆనందించగలడు. అతనిలో ఇంగితం నిద్రలేస్తే.. అసలవి నిలవవు. మానవీయ విలువల్ని భ్రష్టు పట్టించే అపరిపక్వ కథనాలుగా వాటిని పక్కన పెట్టాల్సి వస్తోంది. అటు దేవుళ్ల కథలూ కాక, ఇటు మనుషుల కథలూ కాక, ఎటూ నిగ్గు తేల్చుకోలేని సంశయాత్మక కథనాలుగా ఇవి మిగులుతాయి.

**మంత్రాలు, బాణాలు, ఆదిమ సమాజంలోనివి. విలువలు, నీతి సూత్రాలూ అప్పటివే. అవేవీ ఈ కాలానికి పనికిరావు కదా? ఆదర్శంగా తీసుకుందామంటే ఒక్క పాత్ర కూడా కనిపించదు. అందులోని పాత్రలు ప్రవర్తించినట్టుగా ఎవరైనా నేటి ఆధునికులు ప్రవర్తిస్తే అతణ్ణి, ఆమెను నేటి లోకం ప్రశంసిస్తుందా? ప్రశంసించదు. ఎందుకంటే మనం చాలా ముందుకొచ్చాం. వైజ్ఞానికంగానే కాదు, నైతికంగా, ఆర్థికంగా నేటి సమాజం పరిణతి సాధించింది. మనిషి ఏమాత్రం భోళాగా కనిపించినా 'వీడో ఊరి బైతు' అని ముద్రవేసే జనం.. తిండి విషయంలో, దుస్తుల విషయంలో ఏ మాత్రం అనాగరికంగా కనిపించినా 'ఆదిమానవుడిలా అదేమిటీ?' అంటారు. మరి మన పురాతన కావ్యాల్లో లాగా, మహిమల పేరుతో వావివరుసలు లేకుండా ప్రవర్తిస్తే సమాజం ఒప్పుకుంటుందా? శిక్షించకుండా వదిలేస్తుందా? వదిలేయదు కదా?** అలాంటప్పుడు అలాంటి అపరిపక్వ వ్యక్తిత్వాల్ని చిత్రించిన అనైతిక కావ్యాల్ని మహోన్నతమైనవిగా ఈ కాలం ఎట్లా గుర్తిస్తుంది? ఏమాత్రం హేతుబద్ధంగా ఆలోచించినా విషయం బోధపడుతుంది.

**ఈ కథలు వేల ఏళ్లుగా మన భారతీయ సమాజాన్ని శాసించాయి. నిజమే.. ఆ కథల ఆధారంగా ఎందరో రచయితలయ్యారు. కొందరు జ్ఞానపీఠాలెక్కారు. మరికొందరు విశ్వవిఖ్యాత నటశేఖరులయ్యారు, మత పెద్దలు, పూజారులు, స్వాములు మాత్రమే కాక, నాటక, సినీరంగాల కళాకారులంతా వందల ఏళ్ల పాటు జీవితాలు వెళ్లబోశారు.** అంతా నిజమే.. ఒప్పుకోవాల్సిందే. కాని, ఇప్పటికి అవి కాలం చెల్లిపోయాయి. ఆ బాణాలూ, ఆ గధలూ నేటి జీవితంలో లేవు. ఆ రాజ్యాలు, ఆ యుద్ధాలూ లేవు. ఆ అరణ్య వాసాలూ లేవు. ఆ పట్టాభిషేకాలూ లేవు. ఆ ధర్మరాజులూ లేరు. అందులోని ధర్మ సూక్ష్మాలు, న్యాయ సూత్రాలు, నైతికత ఏమైనా ఈ కాలానికి పనికొస్తుందా? అంటే అదీ లేదు. నేటి తరాలకు అందులోని తాతలు (ఎదగని తనం) స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక్కడ వాటిని దుయ్యబట్టడం లేదు. ఆనాటి కవులు, రచయితల అవగాహనను మాత్రం బేరీజు వేసుకోవాల్సి ఉందన్నది మాత్రమే గుర్తు చేస్తున్నాను. అవి కొంతవరకు మనం నడిచొచ్చిన దారిని చూపించగలుగుతున్నాయేమో గాని, మనం ముందు ప్రయాణించాల్సిన దారిని అవి చూపించలేవు. కారణం వాటికి ఆ శక్తి లేదు. ఎదిగిన నేటి సమాజానికే అవి కాలం చెల్లినవిగా కనిపిస్తున్నప్పుడు ఇక అవి భవిష్యత్తులోకి దారులెలా వెయ్యగలవూ? కాలం చెల్లిన నమ్మకాలు, విశ్వాసాల మీద వచ్చిన ఆ కావ్యాలు అలాంటి అనేక ఇతర మతాల, ఇతర భాషల రచనలు ఈ కాలానికి పనికిరావన్నది మాత్రమే మనం గుర్తించాలి.

**దేవతలూ, రాక్షసులు.. వారి మధ్య యుద్ధాలు తప్ప మనిషి, మనిషి ఔన్నత్యం అందులో ఎక్కడా కనబడదు. అందుకు కారణం మనిషి తనను తాను గుర్తించుకోక ముందు, తన ఉనికిని తాను, తన శక్తిని తాను గుర్తించుకోకముందు రాసుకున్న రచనలవి. ఈ చరాచర జగత్తంతా ఏ పరమేశ్వరుడో సృష్టించిందని అతని ఆజ్ఞానుసారం మనిషి నడుచుకోవాల్సి ఉంటుందన్న భావనతో రాసుకున్న రచనలవి. సమాజం ఆ భావం నుంచి జారిపోకుండా జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్న కొన్ని వర్గాలు ఇప్పటికీ ఈ 21వ శతాబ్దంలో కూడా ఉండనే ఉన్నాయి. ఆధ్యాత్మికత, ధార్మికత అని వేరు వేరు పేర్లతో చలామణి అవుతూనే ఉన్నాయి. ఇవి కేవలం హిందూ మతానికే పరిమితం కాదు. అన్ని మతాలలో, అన్ని దేశాలలో, అన్ని మత గ్రంథాలలో.. సంబంధిత కావ్యాలలో వర్ధిల్లుతూనే ఉన్నాయి.** అయితే మానవుడి విజయ పరంపరను శ్లాఘించని బోధనలేవైనా వృథాయేనని మనం భావించాలి. వ్యక్తిగత భయాలు, విశ్వాసాలు ఉన్నవారిని వెనకే వదిలేయాలి. అలాంటి వారివల్ల సమాజం ముందుకు రాలేదు. ఇకపై కూడా ముందుకు పోదు. ఆత్మవిశ్వాసం, తెగువ, ధైర్యం, తపన, త్యాగబుద్ధి గల మనుషులతోనే ప్రపంచం ముందుకు వచ్చింది. ఇకముందు కూడా వారితోనే ముందుకు పోతుంది.

మానవ బలహీనతల్ని వాడుకునే, సొమ్ము చేసుకునే రాజకీయ, సినీ, టీవీ, వ్యాపార రంగాలవారిపై కూడా మనకు పెద్దగా ఆశలు ఉండనక్కరలేదు. వారంతా వారి పబ్బం గడుపుకోవడంతోనే తీరిక లేకుండా ఉంటారు. శాశ్వత ప్రాతిపదికన రాగల కాలాలలో ఈ ప్రపంచానికి కావాల్సినవేమిటో ఆలోచించే బుద్ధిజీవుల సంఖ్య పెరగాలి. సామాన్యుడి అవగాహన పెరగాలి. ఆలోచన రాటుదేలాలి. **ఏ దేశ ప్రబంధాలలోనైనా, ఏ మత గ్రంథాలలోనైనా, ఏ సనాతన కావ్యాల్లోనైనా మానవుడి వైజ్ఞానిక విజయ పరంపర ఉండడానికి అవకాశం లేదు. అందుకే ఉండదు.. ఎందుకంటే అవి రాయబడ్డ కాలంలో సమాజం చాలా ప్రాథమిక దశలో ఉంది. ఆలోచనలు పదునెక్కలేదు. వాస్తవాలు వెలికిరాలేదు. మనిషేం చేయగలడూ? అంతా ఆ దేవుడే చేయిస్తున్నాడని అనుకునే ఎదగని దశ అది.**

కొన్ని శతాబ్దాల నిర్విరామ కృషి వల్ల, మనిషి తనను తాను తెలుసుకున్నాడు. తన కణాన్ని తన రక్తాన్ని, తన అవయవాల్ని, తన మెదడుని అధ్యయనం చేసుకుంటూ వచ్చాడు. మరీ ముఖ్యంగా ప్రాథమిక దశలో జంతుస్థాయి నుంచి క్రమక్రమంగా 'మనిషి'గా ఎదుగుతూ వచ్చిన వైనాన్ని.. అంటే జీవ పరిణామ క్రమాన్ని నిర్మించుకుంటూ వచ్చాడు. సత్యాన్వేషణలో ఎక్కడా ఆగలేదు. ఇప్పటికీ ఇంకా ముందుకు అడుగులు వేస్తూనే ఉన్నాడు. **ఆధ్యాత్మిక, ధార్మిక రంగాలలోని వారు చెప్పే సత్యాన్వేషణ వేరు.**




**వారు చెప్పే సత్యాన్వేషణతో ప్రపంచంలో మార్పులు రాలేదు. అవి మనిషిలోని అంతరంగాన్ని అదుపులో ఉంచుకోవడానికి మాత్రమే పనికొచ్చాయి. మనిషీ, సమాజం ఎదుగుతున్న దశలో ఏదో ఓ ఊతకర్రలాగా ఉపయోగపడ్డాయి. కానీ మనిషి ఎంతకాలం ఊత కర్రతో నడుస్తాడూ? ఆత్మవిశ్వాసమనే వెన్నెముక నిటారుగా నిలబెట్టి ధైర్యంగా నిలబడాలి కదా? తనను తాను గుర్తించుకుని, చుట్టూ ఉన్న తోటివారిని మనుషులుగా గుర్తించి, ఈ భూగోళాన్ని, ఈ వాతావరణాన్ని రక్షించుకోవాలన్న బాధ్యతతో నడుచుకుంటూ ఉండాలి కదా? వెయ్యేళ్ల నాటి సమాజం కన్నా వందేళ్ల నాటి సమాజం పరిణతి చెందింది. వందేళ్ల నాటి సమాజం కన్నా నేటి సమాజం పరిణతి చెందింది. ఇప్పుడు ఈ కాలంలో బతుకుతూ, వెయ్యేళ్ల నాటి ఆచారాలు, నమ్మకాలు, సంస్కృతి పేరుతో పాటిస్తానంటే వారినేమనాలి? అయినా చారిత్రక ఆధారాలు లేని కల్పిత పాత్రల కోసం అల్లరి మూకలు 'సంస్కృతి' పేరుతో చెలరేగిపోవడం ఎవరు హర్షిస్తారూ?**

మత విశ్వాసాల్ని పక్కనపెట్టి, వైజ్ఞానిక స్పృహకు విలువనిచ్చినప్పుడు, మూఢ విశ్వాసాల్ని మూలకు పడేసి హేతువాదానికి ప్రాముఖ్య మిచ్చినప్పుడు, పుక్కిట పురాణాల్ని నమ్మడం మానేసి చరిత్రకు, మానవ విజయ గాథకు ప్రాధాన్యమిచ్చినప్పుడు మన దేశం నిజంగానే పురోగమిస్తుంది. మంచిరోజులు అప్పుడే వస్తాయి. వేదాలు దోషరహితమైనవని, వాటి ప్రామాణికతను ప్రశ్నించరాదన్న తొలి సిద్ధాంతాన్ని బుద్ధుడు తిరస్కరించాడు. ఇక తర్వాత వచ్చిన ఇతర కావ్యాల గూర్చి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా?



**డాక్టర్ దేవరాజు మహారాజు,**
**సుప్రసిద్ధ సాహితీవేత్త,**
**సైన్స్ ప్రొఫెసర్**

## దేవాలయాల సమస్యల పరిష్కారానికి హైందవ శంఖారావం



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)**

దేవాలయాల సువ్యవస్థీకరణకు దేశవ్యాప్తంగా విశ్వ హిందూ పరిషత్ చేపట్టిన మహా ఉద్యమం ఆంధ్ర ప్రదేశ్ నుంచే ప్రారంభమైందని విశ్వ హిందూ పరిషత్ శ్రీకాకుళం జిల్లా శాఖ తెలిపారు. జనవరిలో జరిగే ఈ హైందవ శంఖారావానికి లక్షలాది మందిని తరలిరావడానికి తగు ప్రయత్నాల కోసం ఆదివారం గురజాడ విద్యాసంస్థల్లో రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ తదితర సంఘ పరివార క్షేత్ర ప్రముఖుల సమావేశం జరిగింది. సమరసతా సేవా ఫౌండేషన్ ప్రాంత సహ ప్రముఖ్ తులసి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ తరతరాలుగా హిందూసమాజానికి ఆధారకేంద్రాలుగా, సంస్కృతీ నిలయాలుగా ఉంటున్న దేవాలయాలు దేవదాయ ధర్మదాయ శాఖ పేరుతో నిరాదరణకు గురవుతున్నాయని, పాలక ప్రభుత్వాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం దేవాలయాలను ఉపయోగించుకొంటున్నాయని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ్ చాలక్ పీవీ రమణమూర్తి, విశ్వహిందూ పరిషత్ ప్రాంత మందిర–అర్చక పురోహిత ప్రముఖ్ ఎస్.ఫల్గుణరావు హైందవ శంఖారావం కరపత్రం విడుదల చేశారు. విభాగ్ సహకార్యవాహ కర్రి లింగరాజు, జిల్లా కార్యవాహ మాధవపాత్రో, విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు లోకనాథం ఆనందరావు, జిల్లా కార్యదర్శి శ్రీరంగం మధుసూదనరావు మార్గదర్శనంలో జిల్లాలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలతో హైందవ శంఖారావానికి సంబంధించిన జనజాగరణ కార్యక్రమ సమాలోచన జరిగింది.

## రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చేశారు

**(సత్యంన్యూస్, పాతపట్నం)**

అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే ఈ రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వ పాలకులు రావణ కాష్టంలా మార్చేసారని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఏదో చోట మహిళలపై నిరంతరాయంగా హత్యలు, అఘాయిత్యాలు జరుగుతున్నా పాలకులు స్పందించకపోవడం చాలా దౌర్భాగ్యమన్నారు. తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వ చేతకానితనం వల్లే నేరస్థులకు భయం లేకుండా పోతోందని, నాలుగు నెలల వీరి పాలనలో 100కు పైగా అత్యాచారాలు జరిగాయని తెలిపారు. ఎవరిపై ఎక్కువ కేసులో ఉంటే వారికి అంతే గౌరవంగా ఉన్నతమైన పదవులు ఇస్తామని లోకేష్ హింసను ప్రోత్సహించారని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోషల్ మీడియాలో ఆడపిల్లలపై నీచంగా మాట్లాడితే తాట తీస్తామని పెద్ద పెద్ద డైలాగులు పలికారని విమర్శించారు. రాష్ట్రంలో 35వేల మంది ఆడపిల్లలు మాయమయ్యారని కేంద్ర నిఘా వర్గాల సమాచారం ఉందని ఎన్నికల ముందు చెప్పిన పవన్ అధికారంలోకి వచ్చి 5 నెలలవుతున్నా ఆ విషయంపై ఎందుకు మాట్లాడడం లేదని ఆమె ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వ అసమర్ధని ప్రశ్నించినందుకు మహిళలపై సైతం అక్రమ కేసులు బనాయిస్తున్న దౌర్భాగ్య ప్రభుత్వం ఇదని రెడ్డి శాంతి ఆరోపించారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి మహిళా రక్షణ విషయంలో సరైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## మినీ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు



**(సత్యంన్యూస్, నరసన్నపేట)**

నరసన్నపేట మినీ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని స్పోర్ట్స్ అథారిటీస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ అనిమిని రావినాయుడు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి ఇండోర్ స్టేడియంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండోర్ స్టేడియంలో అన్ని పరికరాలను ఏర్పాటుచేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ప్రతీ నియోజక వర్గంలోను క్రీడా వికాస కేంద్రాలు ఉన్నాయని, వారికి అక్కడే అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. గ్రామస్థాయి నుంచి క్రీడాకారులను జాతీయ క్రీడల్లో పాల్గొనేలా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పాల్గొనేలా కృషి చేస్తామని, సాధ్యమైనంత తొందరలో ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎంసీఏ సభ్యులు గొద్దు చిట్టిబాబు క్రీడాకారులకు అందుబాటులో ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు.

## ఫ్రెండ్లీ పోలీసుగా వ్యవహరించాలి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

విధి నిర్వహణలో సమన్వయం పాటించాలని, ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీసుగా వ్యవహరించాలని, తద్వారా క్రైమ్ రేట్‌ని తగ్గించే ప్రయత్నం చేయాలని రెండో పట్టణపోలీస్‌స్టేషన్ నూతన సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఎన్నో రకాల క్రైములు జరుగుతూ ఉంటాయని, ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల వైపుగాని, అసాంఘిక కార్యక్రమాల వైపుగాని వెళ్లకుండా అవగాహన కార్యక్రమాలు ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతుందని, ఫిర్యాదుదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో విశాఖపట్నంలో పలు పోలీస్ విభాగాల్లో సీఐగా పనిచేసి, కాశీబుగ్గ రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐగా విధులు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ ఈశ్వరరావుకు ఎస్ఐలు సిబ్బంది అభినందించారు.


























# రైతుల భూములను రికార్డుల్లో మార్చేశారు



**(సత్యంన్యూస్, ఆమదాలవలస)**
రైతుల భూములను ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో చేర్చడంపై స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళంలో కలెక్టర్‌ను కలిసి బూర్జ మండలం లచ్చయ్యపేట గ్రామ రైతు భూములను రీసర్వేలో ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో చూపడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 2023లో చేసిన రీసర్వేలో 146 మందికి పైగా రైతుల భూములను ప్రభుత్వ భూమి గయాలుగా చూపించారని, కాని సదరు రైతులకు ఆ భూములు వారి పూర్వీకుల నుంచి కొందరికి, రిజిస్టర్ మూలంగా కొందరికి సంక్రమించాయని తెలిపారు. 1995లో గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో భూసర్వే చేసి సదరు సర్వేలో రైతుల భూములను వారి పేరున నమోదు చేశారని, రీసర్వేకు ముందు వరకు ఆ భూములు వారి పేరున 1బి, అడంగల్ కూడా వచ్చేవని, ఇవేవీ పరిగణనలోకి తీసుకోకుండా రీసర్వే అనంతరం రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని కలెక్టర్‌కు తెలిపారు. జిల్లాస్థాయి అధికారితో విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. గాంధీతో పాటు సెయిరిగాపు నీలకంఠం, గిరాడ జగన్ మోహన్‌రావు, కొంచాడ మన్మధరావు, సెయిరిగాపు శ్రీను, సెయిరిగాపు వెంకటరావు, కొంచాడ సీతంనాయుడు, సెయిరిగాపు జన, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే
# రెవెన్యూ గ్రామసభలు



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)**
భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తుందని, రైతులు వాటిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గేదెలవానిపేటలో సోమవారం రెవిన్యూ గ్రామ సదస్సును ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ భూసర్వేలో లోపాలు ఉన్నట్లయితే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. రీ-సర్వేలో పొరపాటులను సరిదిద్దేందుకే రెవెన్యూ సభలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చి భూయజమానుల నుంచి భూమిని కాజేసేందుకు పన్నాగం చేసిందన్నారు. సమస్యకు సంబంధించి అవసరమైతే ఫీల్డ్‌కి వచ్చి సంబంధిత సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సర్వేయర్లందరూ క్షేత్రస్థాయికి వెళ్లి సర్వేలు నిర్వహించాలని సూచించారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# అద్దెకొరకు

**శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22X150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.**

**- సంప్రదించగలరు -**

**94403 72300, 98487 96626**


# అరసవల్లిలో 13న తెప్పోత్సవం


**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**
అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి హంసనావికోత్సవం తెప్పోత్సవం ఈ నెల 13న (క్షీరాబ్ధి ద్వాదశి) బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు అత్యంత వైభవం నిర్వహించనున్నట్టు దేవస్థానం ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెప్పోత్సవం సందర్భంగా ఆలయానికి ఎదురుగా ఉన్న ఇంద్రపుష్కరిణి (కోనేరు)లో శ్రీ స్వామి వారిని దేవేరులతో సహా హంసవాహనంపై ఊరేగిస్తారని, భక్తులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

# అంతా ఆయనే చేస్తున్నారు!

**(మొదటిపేజీ తరువాయి)**
సరిపడినంత సప్లై మాత్రం లేదు. అలాగే గత ప్రభుత్వం ఎంసీ విస్కీ, 8 పీఎం వంటి బ్రాండ్లను తొక్కేసింది. దానికి జిల్లా వ్యాప్తంగా విపరీతంగా అభిమానులు ఉన్నారు. అయితే గత ఐదేళ్లుగా ఇక్కడికి ఈ బ్రాండ్‌లు సరఫరా లేకపోవడంతో కంపెనీల్లో ఉత్పత్తి కూడా తగ్గించేశారు. ఇప్పుడు సడెన్‌గా వీటిని తగినంత అందించలేకపోవడంతో వస్తున్న కొద్దిపాటి సరుకును తనకు ఫేవర్ చేస్తున్న పొలిటికల్ లీడర్ల షాపులకు డీపీవో పంపిస్తున్నారట. ఇక డిపోకు మంత్లీలు ఎంత అనేది తేలిన తర్వాత మాత్రమే పూర్తిస్థాయి సరుకు ఇస్తామని తెగేసి చెబుతున్నట్టు భోగట్టా. అయితే రోజుకు రూ.1.13 లక్షలు పైచిలుకు నొక్కేస్తున్న వైనం అక్కడున్న సీనియర్ ఉద్యోగులకు తెలిసిపోయిందని భావించిన డీపీవో వీరిని ఇంటికి పంపించే ఏర్పాటు చేసినట్లు చెప్పుకుంటున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కుదించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఆ సాకుతో సీనియర్లకు మంగళం పాడనున్నట్లు తెలుస్తుంది. ఇక్కడ 11 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పని చేస్తున్నారు. మిగిలిన జిల్లాల్లో కూడా దాదాపు అటూ ఇటుగా ఇదే సంఖ్యలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు లేరు కాబట్టి తమకు ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పనుందని చాలాచోట్ల డీఎంలు ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇక్కడ మాత్రం సీనియర్లను పంపించేసి, తనకు అనుకూలంగా ఉండే జూనియర్లను ఉంచుకోడానికి డీపీవో రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది.

## గ్రామీణ వైద్యుల గుర్తింపుకు ఎమ్మెల్యే హామీ

**(సత్యంన్యూస్, గార)**
గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రాథమిక చికిత్స అందిస్తూ వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులకు గుర్తింపు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరుతానని స్థానిక శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు శంకర్ హామీ ఇచ్చారు. సోమవారం ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తున్న గ్రామీణ వైద్యులకు గుర్తింపు ఇవ్వాలని ముఖ్య మంత్రిని కోరుతానని, స్థానికంగా మీకు ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాననీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, సలహాదారు కోన ప్రకాష్, శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షుడు పాలకొండ రాజు, సహాయ కార్యదర్శి సుగ్గు రాజు, విశాఖ జిల్లా ఈసీ మెంబర్ ఉంగరాల ఈశ్వరరావులు పాల్గొన్నారు.



# ఉపాధి కల్పనకు నైపుణ్య గణన

**(సత్యంన్యూస్, నరసన్నపేట)**
ఉపాధి అవకాశాల కల్పనకు నైపుణ్యగణన ఎంతో ఉపయోగపడుతుందని, ఈ సర్వేకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పోలాకి మండల కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు, పోలాకి మండలం గ్రామ/ వార్డు సచివాలయ సిబ్బందికి నిర్వహించిన కార్యశాలలో ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి తొలి ఐదు సంతకాలలో నైపుణ్య గణన ఒకటని, యువతకు అవసరమైన నైపుణ్యాలలో శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ సర్వేను చేపట్టినట్లు తెలిపారు. ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మసీ, డిప్లమా కళాశాలలను గుర్తించి అక్కడి విద్యార్థులకు నైపుణ్యగణన ప్రాముఖ్యతను వివరించి స్వీయగణన చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసున్న ప్రతి ఒక్కరికి సర్వే చేపట్టి డేటా సేకరించాలని, దీనిపై ఎవరికి ఎటువంటి సందేహాలున్నా నివృత్తి చేసి నైపుణ్య గణన ఉపయోగాలను వారికి ఓపిగ్గా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలాకి గ్రామ/ వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు, గ్రామ/ వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.




# రాష్ట్ర అవతరణను మరువటం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటు

**(సత్యంన్యూస్, ఆమదాలవలస)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం నవంబర్ ఒకటవ తేదీని చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా మరవడం బాధాకరమని మాజీ స్పీకర్, వైకాపా పార్లమెంట్ పరిశీలకులు తమ్మినేని సీతారాం అన్నారు. గత వైసీపీ సర్కార్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పండగ వాతావరణంలో నిర్వహించిందని గుర్తు చేశారు. ప్రస్తుత రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున జిల్లా కేంద్రంలో, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసేందుకే నాయకులు కరువయ్యారన్నారు ఇది ప్రభుత్వం పూర్తి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. ఎన్నికల హామీలలో తెల్ల రేషన్‌కార్డుదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అని చెప్పి తీరా ప్రభుత్వం వచ్చాక ఆ పథకానికి తూట్లు పొడిచారన్నారు. రాష్ట్రంలో 1.50కోట్ల మంది లబ్ధిదారులకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్న ప్రభుత్వం, కేవలం కోటి మందికే పరిమితం చేసిందన్నారు. మిగిలిన 50లక్షల మందికి ఎగనామం పెట్టడం దారుణమన్నారు. లబ్ధిదారులందరికీ ఉచితగ్యాస్ ఇవ్వాలంటే రూ.1345 కోట్లు అవసరం అన్నారు. బడ్జెట్లో కేవలం రూ.895కోట్లు మాత్రమే కేటాయించడం ద్వారా ప్రభుత్వం ఆలోచన ప్రస్ఫుటమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెల్ల రేషన్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి, ఉచితంగా గ్యాస్ సిలిండర్‌లు ఇవ్వాలని తమ్మినేని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. గత నాలుగు నెలల్లో రాష్ట్రంలో ఎక్కడ చూసినా అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం పోయి రెడ్‌బుక్ రాజ్యాంగం రాష్ట్రంలో రాజ్యం ఏలుతుందన్నారు. నంద్యాల జిల్లాలో 8ఏళ్ల బాలిక హత్య, వైయస్సార్ జిల్లాలో యువతపై లైంగిక దాడి అనంతరం పెట్రోల్ పోసి తగలబెట్టడం, గుంటూరు జిల్లాలో యువతిపై అత్యాచారం, ఇటీవల పలాసలో ఇద్దరు మైనర్ బాలికలపై లైంగిక దాడుల వంటివి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి అనడానికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వ హయాంలో దిశా చట్టాన్ని, కూటమి ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చిందన్నారు. కోటి 56 లక్షల మంది మహిళలు దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేశారన్నారు. ప్రస్తుతం ఈ యాప్‌పై ప్రభుత్వం కనీస స్పందన లేదన్నారు. గత వైకాపా సర్కార్‌లో రాష్ట్రవ్యాప్తంగా 18 దిశా పోలీస్ స్టేషన్లు, 12మహిళా కోర్టులు, 13ఫోక్స్ కోర్టులు ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ కక్షతో ఈ వ్యవస్థను నిర్వీర్యం చేయటం తగదన్నారు. దీపావళి పండుగ కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై కరెంటు చార్జీల భారం మోపిందన్నారు బాదుడే బాదుడు అంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబునాయుడు ప్రజలపై అదనపు కరెంట్ చార్జీలు మోతతో ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని తమ్మినేని ప్రశ్నించారు. 2014-19 సంవత్సరాల కాలంలో చంద్రబాబు నాయకత్వంలో అప్పటి ప్రభుత్వం చేసిన అప్పులు, బకాయిలు కలసి రూ.86,215 కోట్లు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు చార్జీలు పెంపుతో అప్పటి ప్రజానీకం రోడ్లపైకి వచ్చిన విషయాన్ని మరవకూడదన్నారు.



## గుంతలు పూడ్చడానికి శ్రీకారం

**(సత్యంన్యూస్, ఆమదాలవలస)**
ఆర్ అండ్ బి రోడ్లకు శాశ్వత మరమ్మతుల కోసం నియోజకవర్గానికి రూ. 2.93 కోట్లు పైచిలుకు మంజూరైందని, వీటితో గుంతలు లేని రోడ్లు, స్టేట్ హైవేలు, జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధానమైన రోడ్డు పునర్నిర్మిస్తామని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం గుంతలు పూడ్చే పనిని లాంచనంగా ప్రారంభించారు. తన ప్రతిపాదనను అంగీకరించిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్ధనరెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## యాచకునికి రెడ్‌క్రాస్ బృందం సపర్యలు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**
అరసవల్లి శ్రీ సూర్యనారాయణమూర్తి సన్నిధిలో నిస్సహాయ అనాధ వృద్ధునికి పూర్తి సపర్యలు చేసి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం మానవత్వం చాటుకున్నారు. ఆదివారం, అందులోను కార్తీక మాసం కావటంతో భక్తులతో కిటకిటలాడిన అరసవల్లి క్షేత్రంలో కనీసం ఒంటిపైన బట్టలు కూడా లేక, తిండి లేక తిరుగుతున్న యాచకుడు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్‌మోహనరావుకు తారసపడ్డాడు. తక్షణమే రెడ్‌క్రాస్ ప్రతినిధి బృందంతో కలసి సపర్యలు చేసి, కొత్త వస్త్రాలతో పాటు, అన్నసమారాధన చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ ఈయనకు మతిస్థిమితం సరిగా లేదని, గత ఆరు సంవత్సరాలుగా ఈయనకి సేవ చేస్తున్నామని, ప్రతి రోజు ఆహారమందిస్తున్నామన్నారు. ఇటువంటివారు ఎవరికైన కనిపిస్తే రెడ్‌క్రాస్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. రెడ్‌క్రాస్, సీవీ నాగజ్యోతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి రోజు నిత్యాన్నదానం శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం మేనేజర్ డి.లక్ష్మణరావు, ప్రసాద్, ఇతర సభ్యులతో స్థానిక ఏడురోడ్ల కూడలి, డే అండ్ నైట్ కూడలి, అరసవల్లి పుణ్య క్షేత్రములలో నిత్యం ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. యాచకునికి సపర్యలు చేసిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు నంది ఉమాశంకర్, జి.పవన్‌కుమార్, వెంకటరమణలను అభినందించారు.



# దటీజ్ పవర్ ఆఫ్ శ్రీకాకుళం

**- సీఎం సహాయ నిధికి వాట్సాప్ గ్రూప్ రూ.1.26లక్షలు వితరణ**
**- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి చెక్ అందజేత**

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**
విజయవాడ వరద బాధితుల కోసం సామాజిక బాధ్యతగా శ్రీకాకుళం నగరానికి చెందిన పవర్ ఆఫ్ శ్రీకాకుళం వాట్సాప్ గ్రూప్ సభ్యులు స్పందించారు. రూ.1.26 లక్షల నగదును సభ్యులంతా కలసి ఇవ్వగా, ఆ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి వితరణగా అందజేసారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శనివారం వాట్సాప్ గ్రూప్ తరపున సభ్యులు తైక్వాండో శ్రీను, కెల్ల చిన్ని, డోల బాలు, కొర్ను ప్రతాప్‌లు కలసి చెక్‌ను ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద కేంద్ర, రాష్ట్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌ల సమక్షంలో అందజేసారు. వరద బాధితులను ఆదుకోవడం కోసం సామాజిక బాధ్యతగా వాట్సాప్ గ్రూపు సభ్యులు ముందుకు రావడం అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు.




# ఒక్కడి చొరవ.. 100 మందిలో కదలిక

**బారువ నుంచి సబ్సిడీ డీజిల్ తెచ్చుకోడానికి ప్రభుత్వం అంగీకారం**
**8 గ్రామాల మత్స్యకారులకు తగ్గిన దూరాభారం**

**(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)**
ఆ మత్స్యకార గ్రామాల్లో ఒక్కడి చొరవ 130 కుటుంబాలకు దూరాభారాన్ని, అంతకు మించి దుబారా ఖర్చును తగ్గించింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలో మార్పు రావచ్చుగానీ, సంకల్పం మంచిదైతే ఎప్పుడైనా, ఎక్కడైనా మేలు జరుగుతుందని చూపించిన ఒక వ్యక్తి కథే ఇది. సోంపేట మండలం గొల్లగండి గ్రామ మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు గండుపల్లి చిన్నరాజారావు మిగతా మత్స్యకార గ్రామాల ప్రతినిధులుగా ఉన్నవారిని ఏకం చేయడం ద్వారా ప్రభుత్వం నుంచి పొందుతున్న డీజిల్ సబ్సిడీ తెచ్చుకోవడంలో దూరాభారాన్ని తగ్గించగలిగారు. వివరాల్లోకి వెళితే..



ఇసుకలపాలెం, రామయ్యపట్నం, చేపల గొల్లగండి, బారువ, ఎకావూరు, బట్టిగొల్లూరు, నడుమూరు, ఎర్రముక్కాం గ్రామాల్లో ఉన్న మత్స్యకారులు, మరీ ముఖ్యంగా బోటు ఉన్న యజమానులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సోంపేట బంకు వద్దకు వెళ్లి డీజిల్ తెచ్చుకునేవారు. దీనివల్ల ప్రయాణపు ఖర్చులతో పాటు దూరాభారం కూడా ఉండేది. దీని మీద గండుపల్లి చిన్న రాజారావు గతంలో పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రిగా ఉన్న సీదిరి అప్పలరాజును కలిసి ఎనిమిది గ్రామాల మత్స్యకారులు సోంపేట నుంచి డీజిల్ తెచ్చుకోవడం వల్ల వచ్చిన సబ్సిడీ ఖర్చుల్లో పోతోందని చెప్పడంతో 2023 సెప్టెంబరు 10న అప్పటి మంత్రి విజయవాడ కమిషనరేట్‌కు ఒక నివేదిక పంపేలా చేశారు. ఈ ఫైల్ కమిషనరేట్‌లో ఉంటుండగానే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో దీన్ని అందరూ మర్చిపోయారు. అయితే చిన్నరాజారావు మాత్రం ఇప్పుడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కలిసి ఈ ఫైల్‌లో మళ్లీ కదలిక తీసుకురాగలిగారు. దీంతో అక్టోబర్ 30న ఈ గ్రామంలో ఉన్న మత్స్యకారులందరూ బారువలో బంకు నుంచి సబ్సిడీ ఆయిల్ తీసుకునే వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి, ఎమ్మెల్యేలను కలిసి కమిషనరేట్‌లో ఒత్తిడి తీసుకురావడం కోసం ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త దాసరి రాజు, జనసేన స్టేట్ జాయింట్ సెక్రటరీ బైపల్లి ఈశ్వరరావులను ఒకటికి పదిసార్లు మంత్రి వద్దకు పంపించి ఈ ఉత్తర్వులను సాధించగలిగారు. దీంతో ఎనిమిది గ్రామాల్లో 130 బోట్ల యజమానులు ఇప్పుడు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.